క్లుప్తంగా

ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో ఇటీవల చాపల మల్లేశ్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో దశదినకర్మ నిమిత్తం స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, అదేవిధంగా గ్రామానికి చెందిన నాగిరెడ్డి, పర్వతాలు, కొడూరు రాములు, శ్రీశైలం, సత్యనారాయణలు కలిపి 11వేల ఆర్థికసాయం బాధిత కుటుంబసభ్యులకు శనివారం అందించారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, శంకర్, కృష్ణయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు సేకరణ



కమ్మెటలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చేవెళ్ల: మండలంలో రెండురోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో పలు గ్రామాల్లో నష్టపోయిన పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు. శనివారం మండలంలోని ధర్మసాగర్, కమ్మెట గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి తులసి, ఉద్యానశాఖ అధికారి అశోక్, ఏఈఓ రమేశ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో 12 ఎకరాల్లో బొప్పాయి తోట, 3 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. బొప్పాయి చెట్లు పెద్దవిగా ఉండటంతో పాటు వాటికి కాసిన కాయల బరువుతో గాలికి ఆ చెట్లు విరిగిపోయాయని తెలిపారు. కమ్మెటలో మొక్కజొన్న పంటలు సైతం చేతికి వచ్చే దశలో ఉండటంతో అవి కాస్తా నేలకు ఒరిగాయన్నారు. మిగతా పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదని తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేసుకొని వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తు చేసుకోండి

నందిగామ: ఆయిల్‌పామ్ సాగు కోసం ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి ఉషారాణి శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ సాగు చేసుకునేందుకు అన్ని రకాలుగా రాయితీలను అందిస్తోందని చెప్పారు. మొక్కలకు గుంతలు తీయడానికి, డ్రిప్పు, మెయింటనెన్సుకు రాయితీలను అందివ్వడమే కాకుండా గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తుందని వివరించారు. ఆసక్తి గల రైతులు సంబంధిత ఏఈఓను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాగమణి, అరుణ


మొయినాబాద్‌రూరల్: విద్యార్థులను చక్కదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఒక ఎత్తు అయితే పిల్లల తల్లిదండ్రులు వారి బాగోగులు చూసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. శనివారం మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో విద్య పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు, గ్రాడ్యుయేషన్ డేను అంగన్‌వాడీ టీచర్ అరుణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగమణి పాల్గొని విద్యార్థులకు అంగన్‌వాడీలో పూర్తి చేసిన సర్టిఫికెట్లు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించడం ఇక్కడ చూడడం మొదటి సారి అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమని పేర్కొన్నారు. అంగన్‌వాడీలో ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో మంగమ్మ, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

గ్రామాల్లో పనిచేయని సీసీకెమెరాలు
- సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో నిర్వహణ గాలికి
- పెరుగుతున్న నేరాలు



పనిచేయని సీసీ కెమెరా



సురంగల్ గ్రామ పంచాయతీలో పనిచేయని సీసీ కెమెరాల స్క్రీన్

మొయినాబాద్: నేరాల సంఖ్యను తగ్గించాలని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) నిద్రపోతున్నాయి. పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా చాలాచోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలీసుల ప్రోద్బలంతో మండలంలో షాపుల యజమానులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1న ముగియడంతో సీసీ కెమెరాల నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కెమెరాల వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా మూలనపడడంతో నేరాలు పెరుగుతున్నాయి.

నిర్వహణ గాలికి..

మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాగా గ్రామ పంచాయతీల్లో ఐదేళ్ల క్రితం సర్పంచ్‌లు దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క గ్రామంలో 12 నుంచి 32 కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన హార్డ్‌డిస్క్, స్క్రీన్‌ను గ్రామ పంచాయతీల్లో పెట్టారు. సర్పంచ్‌లు పదవిలో ఉన్నంతకాలం సీసీ కెమెరాల నిర్వహణను స్వయంగా నిర్వహించారు. అయితే ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. సీసీ కెమెరాల నిర్వహణకు పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమని ప్రత్యేక అధికారులు చెప్పి వాటి నిర్వహణ గాలికొదిలేశారు.

పనిచేయని కెమెరాలు..

మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు సరిగా పనిచేయడంలేదు. మొయినాబాద్, సురంగల్, వెంకటాపూర్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, తోలుకట్ట, అమ్డాపూర్, కాశీంబౌలి, రెడ్డిపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, చందానగర్, చిలుకూరు, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఆయా గ్రామాల్లో కొంతమంది సొంతంగా ఇళ్లు, షాపులు, ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు మాత్రం అక్కడక్కడ పని చేస్తున్నాయి.

పెరుగుతున్న నేరాలు..

గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్నా సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు దొరకకుండా తప్పించుకుంటున్నారు. మరో వైపు గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ బోర్ల కేబుల్స్ కట్ చేసుకుపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగలు దొంగలించడం వంటివి చాలా జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఉంటే ఇలాంటి చోరీలు, నేరాలను అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు.

బాగు చేయించాలి



గ్రామంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పంచాయతీ అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదన్నట్లుగా సమాధానం చెబుతున్నారు. గ్రామంలో నేరాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కెమెరాలు బాగు చేయించాలి.

–కమ్మరి శ్రీనివాస్‌చారి, సురంగల్, మొయినాబాద్ మండలం

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను గతంలో సర్పంచ్‌లు చూసేవారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో నిర్వహణ సరిగా జరగడం లేదు. మొదటి ప్రాధాన్యతగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం. దాతల సహకారంతో గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేస్తే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ రూప్లానాయక్ ఇంట్లో బైర్కాన్‌పల్లి, మంగళిగూడ గ్రామ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేసి మండలం నుంచి అత్యధిక మెజార్టీని అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



చేవెళ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం జోరుగా చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉండాలంటే ఇక్కడి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని చెప్పారు. బీజేపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి కేంద్రంలో పీఎం మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. కేంద్రంలో మోదీ ఉంటేనే దేశం మరింం అభివృద్ధి చెందుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వైభవ్‌రెడ్డి, అభిలాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బాబయ్య

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్: దేశం మరింత అభివృద్ధి సాధించాలంటే బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో షాద్‌నగర్ మున్సిపాలిటీ యువమోర్చా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అందె బాబయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ ఎంతో శ్రమిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తుందని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో దేశం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అఖండ మెజార్టీతో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారను. అనంతరం కమిటీని ప్రకటించారు. బీజేపీ యువమోర్చా మున్సిపాలిటీ అధ్యక్షుడిగా లింగారం సాయికుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గురురాజ్‌గౌడ్, రామకృష్ణ, శివ, పవన్‌కుమార్, వెంకటేశ్, ప్రధాన కార్యదర్శులుగా విజయ్‌కుమార్, శ్రీనాథ్, రవీందర్, కార్యదర్శులుగా శ్రీనివాస్‌చారి, రవితేజ, పల్లె కార్తీక్, అచ్యుత్, సాయివంశీ, భరత్, రాఘవేందర్, అజయ్, శివప్రసాద్, శివకుమార్, కోశాధికారిగా కిరణ్‌కుమార్, సలహాదారుడిగా ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు అందె బాబయ్య నియామకపత్రం అందజేశారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బట్టు రాజమల్లేశ్

మొయినాబాద్: బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన బట్టు రాజమల్లేశ్ నియమితులయ్యారు. ఇటీవల శంషాబాద్‌లో జరిగిన బీజేవైఎం సమావేశంలో జిల్లా కమిటీ నియామకం జరిగింది. అందులో భాగంగా మొయినాబాద్‌కు చెందిన బట్టు రాజమల్లేశ్ కొన్ని సంవత్సరాలుగా ఏబీవీపీ, బీజేవైఎంలో పనిచేస్తూ సంఘాల బలోపేతానికి కృషి చేశారు. రాజమల్లేశ్ పనితీరును పరిశీలించిన అధిష్టానం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిశ్‌లు రాజమల్లేశ్‌ను నియమిస్తూ శనివారం నియామకపత్రాలు జారీ జేశారు. ఈ సందర్భంగా రాజమల్లేశ్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, అంజన్‌కుమార్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం



ఎన్నికల ప్రచారంలో సీతారెడ్డి, తదితరులు

ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

షాబాద్: దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా అభివృద్ధి శూన్యమని ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని కేసారం, కక్కులూర్, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో శనివారం ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లు గడుస్తున్నా నిరుపేదల బతుకుల్లో మార్పు రాలేదన్నారు. జన్‌ధన్ ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామన్నా హామీ నేటికీ నెరవేరలేదన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల ఊసే లేదని విమర్శించారు. దీంతో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని పేర్కొన్నారు. రంజిత్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ హైవే నాలుగు లేన్ల రహదారిగా చేస్తామన్నారు. యూపీఏ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, చెన్నయ్య, నర్సింహులు, అనితారెడ్డి, మల్లేశ్, చెన్నయ్య, అశోక్, అశ్విని, యాదగిరి, సత్యనారాయణ, నర్సింహులు, బుచ్చయ్య, పెంటయ్య, రవీందర్, వేణుగోపాల్, వెంకటయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ అమోఘం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్ తదితరులు

వీజేఐటీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని వీజేఐటీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి అన్నారు. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్, ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన పోటీలు వారంరోజుల పాటు అహ్మదాబాద్‌లో జరిగాయి. ఈ పోటీల్లో ఉత్తమ డిజైన్ అవార్డును సెన్సార్‌లు కెమెరా, ఫెలోడ్‌లతో కూడిన చిన్న స్థూపకార ఉపగ్రహం 800 మీటర్ల ఎత్తు నుంచి డ్రోన్ ద్వారా విడుదల చేశారు. ఈ అవరోహణను నియంత్రించడానికి విద్యార్థులు 500 మీటర్ల ఎత్తులో ప్యారషూట్‌లను మోహరించారు. గ్రౌండ్ స్టేషన్‌లో టెలిమెట్రీని పొందారు. ఈ బృందంను ఇస్రో చైర్మన్ సోమనాథ్, ఇన్‌స్పేస్ చైర్మన్ శ్రీపవన్ గోయంకా, డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఏఎస్ఐ ఎగ్జిక్యూటివ్ ప్రశంసలు పొందారు. అదే విధంగా నంబి వీజే బృందంలో 8 మంది విద్యార్థులు మిస్టర్ సబీన్, స్ఫటిక ప్రసాద్, సోమ కునాల్, రాజ్ కేతవ్, శ్రీకాంత్, ఓవైస్ హుస్సేన్, సాయిహర్షిత ఆలూరు, సాయిపూర్ణా లక్ష్మణ్‌లు కలిసి ఎలమంచిలి సూర్యతేజ రెండు సంవత్సరాలుగా అధ్యాపకుల మార్గదర్శకంలో ఈ ప్రాజెక్టులో పని చేశారు. ప్రాజక్టు ఎలక్ట్రానిక్స్ ప్రొఫెసర్ మహ్మద్ అక్రమ్ ద్వారా సమన్వయం పొందారు. దీంతో అహ్మదాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ప్రశంసలు పొందడంతో కళాశాల తరపున అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.పద్మజ, శ్రీలత, ఏవో వెంకటాచలం, రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంచి గ్రంథాలతో సమాజానికి మేలు

చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

మొయినాబాద్‌రూరల్: సమాజాభివృద్ధికి ఉపయోగపడే గ్రంథాలను రచిస్తే వాటితో ఎంతో మేలు జరుగుతుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో జరిగిన పుస్తకావిష్కరణలో భాగంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ విజయ్, డాక్టర్ జి.ఎస్.చౌహాన్‌లు డిప్యూటీ సెక్రటరీ యూజీసీ న్యూ ఢిల్లీ ఉమ్మడిగా రచించిన భారతదేశ, ఉత్తర తెలంగాణ పర్యావరణ పర్యాటక స్థిరమైన అభివృద్ధి అనే పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాత్వికరెడ్డి ప్రొఫెసర్లను అభినందిస్తూ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉద్దేశించి దేశం అభివృద్ధిలో కొనసాగుతున్న పరిస్థితుల్లో పరిశోధన కార్యక్రమాలు విద్యార్థులకు అందిపుచ్చుకునే విధంగా ఉండాలన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు మంచి పేరు తీసుకురావాలంటే మంచి గ్రంథాలు ఎంతో అవసరమన్నారు. ఇలాంటి పుస్తకాలు రాసి మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర అడ్మినిస్ట్రేషన్ డి.రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. భక్తుల భజనలు, శ్రీరామ నామ కీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన శ్రీదేవి ప్రసాద్ దంపతులు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం భక్తులకు దాత శివకుమార్ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను ఆలయ అర్చకుడు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్, ఎంసాని నర్సింలు, రఘుగౌడ్, రాఘవేందర్‌గౌడ్, రఘునందన్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణచారి, శంకర్‌గౌడ్, యాదగిరి, పద్మావెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాసంప్రోక్షణ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పరిగి రోడ్డులోగల రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడేళ్ల పాటు ఇస్కాన్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ దేవాలయం బాధ్యతలను గత నెల పూర్వ ఆలయ కమిటీకి అప్పగించారు. ఈ సందర్భంగా రెండురోజులుగా ఆలయ అర్చకుడు రాఘవేంద్రచార్యులు బృందం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి నుంచి గతంలో మాదిగానే ప్రతినెల పౌర్ణమిరోజు ఆలయంలో సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కట్టప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కట్ట పుల్లయ్య, సత్యదేవ కాలనీ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కొత్తూరు: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పీఎం మోదీ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మంగళి రమేశ్ అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎన్నుకొని సభ్యులకు నియామపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే అవినీతి నిర్మూలన సాధ్యమని, దేశం అన్ని రంగాల్లో ఎంతో పురోగతి సాధించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రధాని మోదీ రైతులు, ఉద్యోగులు, విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. పట్టణాలు మొదలుకొని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత బీజేపీకే ఉందన్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు ఖాయమన్నారు. నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిషలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాము, శ్రీనివాస్, శ్రీను, ప్రభాకర్, ఇంద్రసేనారెడ్డి, జంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.